క్లుప్తంగా

శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాహు కేతు పూజ టికెట్లు కూడా 5,692 టికెట్లు అమ్ముడుపోయినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

నాలుగో రోజు ఆషాఢ నవరాత్రులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీసర్వ మంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారాహి ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీవారాహి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీవారాహి అమ్మవారి అభిషేకాలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డెయిరీ వారు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత పర్యవేక్షించారు.

ముక్కంటీశునికి విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన ట్రస్టుకు వరంగల్‌కు చెందిన గుండా లలిత్ కేశవ్ దంపతులు రూ.51 వేలు గుండా రామ్ శివ్ కేశవ్ దంపతులు ఆదివారం రూ.51వేలు విరాళంగా ఇచ్చారు. శివయ్యను వారు దర్శించుకున్న అనంతరం అలయ పరిపాలనా భవనంలో ఏఈవో మోహన్‌ను దాతలు కలిసి నిత్యాన్నదాన ట్రస్టుకు నగదును అందజేశారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో గర్భవతులు, బాలింతలు, పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో 32 మంది గర్భవతులు, బాలింతలు, పిల్లలున్నారు. ఈ భవనాన్ని గత ఏడు సంవత్సరాలుగా నిర్మిస్తూనే ఉన్నారు. దీంతో గర్భవతులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి వద్దకు వెళ్తున్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గర్భవతులు, బాలింతలు, పిల్లలు కోరుతున్నారు.

పరాశరేశ్వరునికి నంది సేవ

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఆదివారం సాయంత్రం నంది వాహనాన్ని స్వామి, అమ్మవార్లు అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలను, పరివార దేవతలకు అభిషేకాలను చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర స్వామివారికి సుగంధ పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. దూప, దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం నిత్య, ప్రత్యేక పూజలను అందుకున్న ఉత్సవర్లు సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి, నంది వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు గ్రామోత్సవంలో భక్తుల నుండి హారతులు అందుకుని పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం గజ వాహనంపై ఉత్సవమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు.



నంది వాహనంపై పరాశరేశ్వరస్వామి

ఆహారం.. ఆరోగ్యం

- సీజనల్ వ్యాధుల్లో ఆరోగ్య నియమాలు తప్పనిసరి
- శుభ్రతతో వ్యాధులు దూరం
- తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలి
- వైద్యుల సలహాలు పాటించడంతో మేలు

ఐరాల: వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో చిన్నా, పెద్దా తేడా లేకుండా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజు వారీగా పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల విషయంలో వైద్యుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలని సూచిస్తున్నారు. నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే జంక్ ఫుడ్, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్ డ్రింక్స్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజువారీ ఆహారం ఇలా



ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు. 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామ కాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో ఉండకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి. ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి. ఇవి కాకపోతే 100 గ్రాముల మాంసాహారం ఉండాలి.



తాజా కూరగాయలు

నియమాలు పాటించాలి

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు వారంలో ఒకసారి చికెన్, మటన్, రొయ్యలు వంటివి స్వల్పంగా తినాలి. భోజనానికి ముందు, తర్వాత తప్పని సరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.



నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీ లీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు.

కొద్ది కొద్దిగా తీసుకోవాలి

పరిశుభ్రమైన ఆహారం, పరిసరాల శుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు. ఆహారాన్ని ఒకే సారి కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు లేదా నాలుగు గంటలకు ఒక సారి తీసుకోవడం ఉత్తమం. రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ, పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

జలుబు నివారణకు జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడినీరు, పాలు, టీలో ఏదేని ఒక దానిలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారంతో ఆరోగ్యం

ఆహారం బాగా ఉడికించి తినాలి. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఏ, డీ, సీ, కే విటమిన్లు కలిగిన వాటిని తీసుకోవాలి. అలా తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి. గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– రెడ్డెప్ప, వైద్యాధికారి, ఐరాల

శాంతిభద్రతల కోసమే కార్డన్ సెర్చ్



నాగలాపురంలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్న పోలీసులు



తారక రామా నగర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామ నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో కలసి తెల్లవారుజామున ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఐడీ కార్డులను పరిశీలించి, సక్రమంగా రికార్డుల్లేని 18 ద్విచక్ర వాహనాలను, 3 ఆటోలు సీజ్ చేశారు. సీఐ జయచంద్ర మాట్లాడుతూ ప్రజలను ఎవరు ఇబ్బంది పెట్టినా ఉపేక్షించేది లేదని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలు ఏమి జరిగినా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఇంటిని అద్దెకిచ్చేటప్పుడు అడ్రస్ ప్రూఫ్ తీసుకొని అద్దెకి ఇవ్వాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు అరుణ్ కుమార్ రెడ్డి, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాగలాపురం: శాంతిభద్రతల కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కస్తూరినాయుడు కండ్రిగ గ్రామంలో తెల్లవారుజామున కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని తనిఖీలు చేస్తుండగా ఎన్.గోవిందయ్య(71) ఇంటిలో నుంచి ఎస్‌బీఎంఎల్ కంట్రీ మేడ్ (నాటు తుపాకీ), దీనికి ఉపయోగించే నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ ఇతను కేవీబీపురం మండలంలోని అంజూరు గ్రామం నుంచి ఇక్కడికి వలస వచ్చినట్లు, శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజిలో వైల్డ్ లైఫ్ కేసు ఇతని మీద నమోదైనట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తున్నట్లు, సరైన పత్రాలను అందజేసి వాహనాలను తీసుకెళ్లాలని తెలిపారు. ఎస్ఐతో పాటు ఏఎస్ఐ షణ్ముగం, హెడ్ కానిస్టేబుల్ హనీఫ్, నటరాజ, కానిస్టేబుల్స్ భూపతి, కృష్ణ, దివాకర్, తంబురాజ్, ప్రసాద్, హోంగార్డ్ ప్రభు ఉన్నారు.

పురవీధుల్లో ఊరేగిన శ్రీకృష్ణార్జునులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన ద్రౌపదీ సమేత స్వామి ఆలయంలో జరుగుతున్న తిరుణాలలో భాగంగా ఆదివారం అర్జున, ద్రౌపది, శ్రీకష్ణ స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. ధర్మరాజుల గుడి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవంలో పోతురాజు కత్తి పట్టుకుని ముందు వెళ్తుండగా అర్జున, ద్రౌపది, శ్రీకష్ణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మేళ తాళాలు పంబ వాయిద్యాలు వాయిస్తూ గొడుగులు పట్టుకుని ముందు ఆలయ సిబ్బంది నడిచారు. తిరునాళ్లలో మూడో రోజు శనివారం రాత్రి మహాభారతంలోని అర్జునుడు సాధువు రూపంలో మత్స్య యంత్ర ఛేదన హరికథా గానం ద్వారా ప్రజలకు వినిపిస్తారు. సోమవారం ద్రౌపదీ కల్యాణం ఘట్టం నిర్వహించనున్నారు.



పురవీధుల్లో విహరిస్తున్న వేషధారులు

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



పానగల్లులో దుకాణం తెరవక ముందే కూల్ డ్రింక్ షాప్‌లో మద్యం విక్రయాలు



కూల్ డ్రింక్ షాప్‌లో మందుబాబు తాగుతున్న మద్యం

శ్రీకాళహస్తి: పట్టణంలో మద్యం వ్యాపారం జోరుగా సాగుతున్నాయి. మద్యం దుకాణం పక్కన అనుమతి లేని పర్మిట్ రూముల్లో, బెల్ట్ షాపుల్లో మద్యం దుకాణాలు తెరవక ముందే తెరిచి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ పేదల శ్రమను దోచేస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

మద్యం దుకాణాల్లో ఓపెన్ సిట్టింగ్

ఇక లైసెన్స్ మద్యం దుకాణంలోనూ ఎటువంటి అనుమతులు లేకుండానే ఓపెన్ సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కూల్‌డ్రింక్, టిఫిన్ సెంటర్ల లోనూ మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. క్వార్టర్‌పై రూ.50 అధికంగా వసూలు చేస్తున్నారు. పట్టణంలోని పానగల్లు వద్ద గల ఓ మద్యం దుకాణం పక్కన ఉన్న కూల్ డ్రింక్ షాప్‌లో తెల్లవారక ముందు నుంచే, బ్లాక్‌లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో క్వార్టర్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు మందుబాబులు పేర్కొంటున్నారు. దీనిలో ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు అందుతున్నాయని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

తూతూ మంత్రంగా తనిఖీలు

ఈ వ్యవహారం అంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ, తమకు ఏమీ సంబంధం లేదు అన్నట్లు ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. వారు ఏదో ఒక గ్రామంలో నాటుసారా తాగొద్దంటూ అవగాహనకే పరిమితమవుతున్నారు. డ్రగ్స్ నిరోధక ర్యాలీలో కనిపిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ పరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఉంటే వాటిపై దాడి చేయడం ఎక్కడా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు గ్రామంలో శనివారం రాత్రి శ్రీపాండురంగస్వామి అగ్నిగుండం కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీపాండురంగ స్వామి చిత్రపటాలను పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. శ్రీపాండురంగ స్వామి చిత్రపటాల వద్ద గ్రామస్తులు పూజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శ్రీపాండురంగస్వామి చిత్రపటాలను గ్రామంలో ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం చేశారు. ఆవులకు గోపూజ చేశారు. భక్తులకు ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

ఖైదీలకు చట్టంపై అవగాహన అవసరం

శ్రీకాళహస్తి: రిమాండ్ ఖైదీలకు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని సబ్ జైళ్లను ఆమె సందర్శిస్తున్నారు. ఈ మేరకు శ్రీ కాళహస్తి సబ్ జైలును ఆదివారం సందర్శించారు. ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్న లోక్ అదాలత్ విజయవంతం చేయాలని అవగాహన కల్పించారు. సబ్ జైల్లో పర్యటించి ప్రతి ఖైదీతో మాట్లాడారు. జైలు గదుల్లో, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించి శుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. సబ్ జైలు ఆవరణలో తులసి మొక్కను నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రిమాండ్ ఖైదీకి తప్పక చట్టంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఒక అర్జీ రూపంలో ఇస్తే వెంటనే పరిష్కరిస్తామని ఆమె వారికి హామీ ఇచ్చారు. జూలై 5వ తేదీ జరుగు లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కక్షి దారులకు న్యాయవాదులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీకాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, పాల్గొన్నారు



తులసి మొక్క నాటుతున్న న్యాయమూర్తి

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేణిగుంట: తిరుపతి మార్గంలోని పారిశ్రామిక వాడలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట తిరుపతి మార్గంలోని పారిశ్రామిక వాడలో షిబార్ కర్మాగారం సమీపంలో కల్వర్టు వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు గాజులమండ్యం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఎవరికైనా సమాచారం తెలిస్తే గాజులమండ్యం పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివి



రామకృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న పిన్నెలి రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివని విశ్రాంత సర్వశిక్షా అభియాన్ పీఓ చిట్టిబాబు అన్నారు. రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను వరదయ్యపాళెంలోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. మండల ఎంఈఓ సరస్వతి అధ్యక్షత వహించగా పలువురు వక్తలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం గజమాలలు, శాలువాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-2 గున్నయ్య, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, అమ్మా భగవాన్ సేవా ట్రస్టు విద్యా విభాగం అధ్యక్షుడు హరిగోపాల్ రెడ్డి, మాజీ టెలికాం సభ్యుడు సుందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుకు ఆర్టీసీ బస్సులేవీ?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి నెల్లూరుకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. 6 గంటలకు ఒకటి ఏడు గంటలకు ఎనిమిది గంటలకు ఒకటి మూడు హయ్యర్ బస్సులు ఉండగా ఏ బస్సు రాకపోవడం గమనార్హం. ఆదివారం వస్తే డ్రైవర్లు రాకపోవడంతో హయ్యర్ బస్సు ఓనర్లు చేతులెత్తేస్తున్నారు. దీంతో నెల్లూరుకు వెళ్లాల్సిన బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీకాళహస్తి అలయానికి వచ్చే భక్తులు ఆదివారం సాయంత్రం రాహు కాల సమయం వరకు వేచి ఉండి పూజలు చేసుకుంటారు. వారు ఆర్టీసీ బస్టాండ్‌కి వచ్చేసరికి ఏడుగంటలవుతుంది. ఆ సమయంలో నెల్లూరుకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన బైపాసు రోడ్డుకు వెళ్లి బస్సులు ఎక్కుదామంటే అక్కడ ఏ విధమైన సౌకర్యాలు లేక భక్తులు, మహిళలతో అక్కడకు వెళ్లడానికి సుముఖత చూపడం లేదు. దీనిపై గతంలో డిపోలో ఫిర్యాదు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.